క్లుప్తంగా

జీఎంగా శ్రీనివాసరావు

సింగరేణి(కొత్తగూడెం): కార్పొరేట్ మెటీరియల్ పొక్యూర్‌మెంట్ జనరల్ మేనేజర్‌గా నైనీ ఏరియా జీఎంగా విధులు నిర్వహిస్తున్న టి.శ్రీనివాస్‌రావును నియమిస్తూ మంగళవారం యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పుడు ఈ పోస్టులో జీఎంగా విధులు నిర్వహిస్తున్న మల్లెల సుబ్బారావు ఈనెల 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు.

ఏరియాలో స్ట్రక్చరల్ కమిటీ సమావేశం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలోని జీఎం కార్యాలయంలో మంగళవారం గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులతో వేర్వేరుగా ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు స్ట్రక్చరల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు పలు సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాల అంశాలపై వివిధ విభాగాల అధికారులతో చర్చించారు. జీఎం మాట్లాడుతూ.. సమస్యలపై ఏరియా అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని, కార్పొరేట్ లెవల్లో పరిష్కారం అయ్యే వాటిని అక్కడి అధికారులతో చర్చించి పరిష్కారమార్గం చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్‌రావు, జె.గట్టయ్య, సుధాకర్, ఎండీ రజాక్, నాగరాజు, సమ్మయ్య, అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలి

జూలూరుపాడు: ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను రద్దు చేయాలని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్లు రావాలంటే ముడుపులు ఇవ్వాలంటూ అధికార పార్టీలో కొందరు నాయకులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. మా గిరిజన బిడ్డ ఎమ్మెల్యేపై బురద జల్లే ప్రయత్నం జరుగుతోందన్నారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చరణ్ నాయక్, గణేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ మెజిస్ట్రేట్‌కు సన్మానం

కొత్తగూడెంటౌన్: ఇటీవల స్పెషల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా వచ్చిన మెండు రాజమల్లును మంగళవారం సీనియర్ న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రం కొత్తగూడెంలోని జిల్లా కోర్టు హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు సింగరేణి స్టాండింగ్ కౌన్సిల్ జీవీకే మనోహర్ రావు, వెల్లంకి వెంకటేశ్వరరావు, రావి విజయ్‌కుమార్, ఊటుకూరి పురుషోత్తమరావు తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజు రైటర్ల నిరసన

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దు చేయాలని కొత్తగూడెంలోని దస్తావేజు లేఖరులు సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. మాట్లాడుతూ.. స్లాట్ బుకింగ్ విధానం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, చలానా చెల్లించిన తరువాత, సర్వర్ పనిచేయక చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అనంతరం కొత్తగూడెం సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు.

శాంతి చర్చలు జరపాలి

జూలూరుపాడు: మావోయిస్టులతో శాంతి చర్చలు జరపడంతోపాటు ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్కే ఉమర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, ఆదివాసీలకు రక్షణ కల్పించాలని, కర్రిగుట్టలను చుట్టుముట్టిన కేంద్ర బలగాలను వెనక్కి రావాలని పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జూలూరుపాడులో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో వల్లోజి రమేష్, కూరాకుల నరసింహారావు, సీతయ్య, గోపి, ఎర్రయ్య, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

జీపీల సిబ్బందికి అదనపు భారం

- క్షేత్ర సహాయకుల కొరత తీరేదెన్నడో..?
- కొత్త పంచాయతీల్లో జరగని నియామకాలు
- 'ఉపాధి' పథకాన్ని వెంటాడుతున్న పర్యవేక్షణ లోపం


ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

ఇల్లెందురూరల్: నిరుపేదలకు పని కల్పించి వలసలను నివారించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రూపొందించింది. నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నాయి. కానీ పెరిగిన పంచాయతీలకు అనుగుణంగా క్షేత్రసహాయకుల నియామకం లేకపోవడంతో ఉన్న సిబ్బందికి అదనపు బాధ్యతలు భారంగా మారాయి. ఈ ప్రభావం ఉపాధి పథకం అమలులో పర్యవేక్షణపై చూపుతోంది.

29 పంచాయతీల్లో 15 మంది

నాలుగేళ్లక్రితం తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఉపాధి హామీ పథకంలో క్షేత్రస్థాయి సిబ్బంది ఆందోళన బాటపట్టారు. కన్నెర్ర చేసిన ఆనాటి ప్రభుత్వం 2021లో ఉపాధి హామీ పథకంలో క్షేత్రసహాయకులను తొలగించింది. ఈ క్రమంలోనే నాటి ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన పెద్ద పంచాయతీల స్థానంలో పరిపాలన సౌలభ్యం కోసం చిన్న గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసింది. ఇదిలా ఉండగా క్షేత్రసహాయకులు తమను విధుల్లోకి తీసుకోవాలని చేపట్టిన ఆందోళనలకు దిగొచ్చిన నాటి ప్రభుత్వం తిరిగి ఏడాదిలోనే విధుల్లోకి తీసుకుంది. కానీ పెరిగిన పంచాయతీలకు అనుగుణంగా క్షేత్రసహాయకుల నియామకం చేపట్టలేదు. ఫలితంగా మండలంలో 29 గ్రామపంచాయతీలు ఉండగా 15 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. దీంతో ఉన్న సిబ్బందికి పనిభారం తప్పడం లేదు.

క్షేత్రస్థాయిలో వారి విధులే కీలకం...

గ్రామాలలో ఉపాధి పనులను గుర్తించడం, కూలీలకు పని కల్పించడం, పర్యవేక్షించడం, పనికోసం దరఖాస్తు చేసుకునే కూలీలకు జాబ్‌కార్డులు జారీ చేయడం, పని ప్రదేశంలో కూలీలకు సౌకర్యాలు కల్పించడం, కొలతలు, కూలీలకు వేతన స్లిప్పులు పంపిణీ వంటి పనులన్నీ క్షేత్ర సహాయకులే నిర్వహించాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయిలో పనిభారం పెరగడంతో పలు గ్రామపంచాయతీలలో అనుభవం కలిగిన మేట్‌లను గుర్తించి పనులు చేయించే బాధ్యతను అప్పగిస్తున్నారు. ఇలా క్షేత్ర సహాయకులు అదనపు బాధ్యతలను సర్దుబాటు చేసుకుంటున్నారు.

కొరవడిన పర్యవేక్షణ...

గ్రామపంచాయతీలలో ఉపాధి పనులను పర్యవేక్షించాల్సిన బాధ్యత క్షేత్ర సహాయకులపై ఉంటుంది. కానీ రెండు, మూడు పంచాయతీలలో బాధ్యతలు కలిగి ఉండటంతో పనుల పర్యవేక్షణ సమస్యగా మారింది. అనుభవం కలిగిన మేట్‌లకు కొన్ని గ్రామపంచాయతీలలో పర్యవేక్షణ బాధ్యతలు అప్పగిస్తుండగా మరికొన్ని చోట్ల ఆ బాధ్యతను పంచాయతీ కార్యదర్శులు నిర్వహించాల్సి వస్తోంది. ఇప్పటికే గ్రామపంచాయతీలలో పాలకవర్గాలు లేక పని ఒత్తిడిలో ఉన్న కార్యదర్శులకు ఉపాధి హామీ పథకం పనులపై దృష్టి సారించలేకపోతున్నారు. .

సామాజిక తనిఖీలో..

ఉపాధి హామీ పథకం పనులలో పర్యవేక్షణ కొరవడి జరిగే తప్పిదాలకు క్షేత్రసహాయకులే బలిపశువులు కావాల్సి వస్తోంది. ఏడాదికోమారు ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్వహించే సామాజిక తనిఖీలో వెలుగు చూస్తున్న అవకతవకలలో క్షేత్ర సహాయకులనే బాధ్యులను చేస్తున్నారు. పెరిగిన గ్రామపంచాయతీలు, కూలీల సంఖ్యకు అనుగుణంగా క్షేత్రసహాయకులను నియమించాలన్న ప్రతిపాదన సామాజిక తనిఖీ సమయంలోనూ ఉన్నతాధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదించకపోవడం సిబ్బందికి శాపంగా మారుతోంది. ఫలితంగా ఏటా సామాజిక తనిఖీ అనంతరం చెల్లించాల్సిన జరిమానాలో వీరి వాటానే అధికంగా ఉంటోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పంచాయతీల సంఖ్యకు అనుగుణంగా ఉపాధి హామీ పథకంలో తమ నియామకం చేపట్టాలని క్షేత్రసహాయకులు కోరుతున్నారు.

ఉన్న సిబ్బందిని సర్దుబాటు చేస్తున్నాం..



మండలంలో 29 గ్రామపంచాయతీలు ఉండగా 15 మంది క్షేత్ర సహాయకులు మాత్రమే విధుల్లో ఉన్నారు. వీరిని పర్యవేక్షించేందుకు కేవలం ఐదుగురు సాంకేతిక సహాయకులు ఉన్నారు. సిబ్బంది కొరతగా ఉన్నా విధుల్లో ఉన్నవారిని అన్ని గ్రామ పంచాయతీలకు సర్దుబాటు చేసి పనులు కొనసాగేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– శంకర్, ఏపీఓ, ఇల్లెందు మండలం

ప్రజలకు మరిన్ని సేవలు అందించండి..


ట్రైనీ ఎస్‌ఐలతో బార్ అసోసియేషన్ సభ్యులు

కొత్తగూడెంటౌన్: పోలీసులు ఫ్రెండ్లీ పోలీసులుగా ప్రజలకు మరింత దగ్గరవ్వాలని కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ అన్నారు. మంగళవారం కొత్తగూడెం జిల్లా కోర్టులోని లైబ్రరీ హాల్‌లో జరిగిన పోలీసుల చట్టాలు, న్యాయవ్యవస్థలపై అవగాహన శిక్షణ కార్యక్రమంలో అటాచ్‌మెంట్‌లో ఉన్న ట్రైనింగ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్కినేని మాట్లాడారు. పోలీసు వృత్తి పవిత్రమైందని, ప్రజాసేవ చేసేందుకు వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జే.గోపీకృష్ణ, బాగం మాధవరావు, కాసాని రమేష్, ఉప్పు అరుణ్, కె.చిన్నికృష్ణ, మాలోతు ప్రసాద్, ప్రవీణ్, అబ్దుల్ ఘని పాల్గొన్నారు.

మహాసభల వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): తిరుపతిలో మే 15 నుంచి 18వరకు జరగనున్న 17వ ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక శేషగిరిభవన్‌లో మంగళవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి షేక్ నాగుల్ మీరా మాట్లాడుతూ... భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారటీ యాక్ట్‌ను అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ పబ్లిక్ సెక్టారులో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయాలని, దేశ వ్యాప్తంగా ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని, 2020 నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండీ ఖయ్యూం, ఎస్‌కే రసూల్, చంద్రగిరి ప్రసాదరావు, షేక్ ఖాసీం, కోడూరు నగేష్, భూక్యా గణేష్, టి.వంశీ, విజయ్‌రాజ్, ఎస్‌కే జమీర్‌పాషా, ఎస్‌కే సమీర్, నాగరాజు, షేక్ మదార్‌సాబ్ పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు పెంచాలి


సింగరేణి(కొత్తగూడెం): ధర్నా నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు పెంచాలని మంగళవారం కాంట్రాక్ట్ జేఏసీ ఆధ్వర్యంలో సింగరేణి హెడ్డాఫీసు ఎదుట ధర్నా నిర్వహించి, జీఎం పర్సనల్ కవితానాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సింగరేణిలోని వివిధ విభాగాలలో సుమారు 35 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని, వీరికి కోలిండియాలో 2013 నుంచి హైపవర్ వేతనాలు చెల్లిస్తుండగా, సింగరేణిలో మోకాలడ్డుతూ కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు నోరుమెదపటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నెమ్మెళ్ల సంజీవ్, అలీమొద్దీన్, రామకృష్ణ, కరుణ, నాగలక్ష్మి, రాధా నిర్మల, సంధ్య, కృపా, నరసింహా, భగవాన్, ప్రభాకర్, పోశం, ఆంజనేయులు, రమేష్, ఆసిఫ్, వలీ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏరియా జీఎం వీసం కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం కార్మిక సంఘాల జేఏసీ పిలుపు మేరకు జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎండీ రాసుద్దీన్, కొండపల్లి శ్రీనివాస్, కొక్కు సారంగపాణి, తోడేటి నాగేశ్వరరావు, ముద్రగడ వంశీ, బయ్యా వరప్రసాద్, పోషం బాబు, డి.మోహన్ రావు, ఆంజయ్య, సామేల్, ఉపేందర్, చారీ, లాలు తదితరులు పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభం


శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న జీఎం కృష్ణయ్య

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా 24 రన్స్ అండ్ గోల్స్ స్టేడియంలో మంగళవారం ఏరియా జీఎం వీసం కృష్ణయ్య ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. మాట్లాడుతూ... సింగరేణిలో పని చేస్తున్న ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వారి పిల్లలకు ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్ క్రీడలలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 25 రోజుల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఉద్యోగుల పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్‌రావు, ఎస్టేట్ ఆఫీసర్ శివవీరకుమార్, స్పోర్ట్స్ సెక్రెటరీ సాయి స్వరూప్, అధికారుల సంఘం నుంచి పవన్‌కుమార్, గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రెటరీ నజీర్ అహ్మద్, ప్రాతినిధ్య సంఘం నుంచి మహబూబ్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ రమేష్ సింగ్, బాస్కెట్ బాల్ కోచ్ సుమిత్ పాల్గొన్నారు.

పనిగంటల పెంపుపై పోరాడాలి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

జూలూరుపాడు: మే డే స్ఫూర్తితో పనిగంటల పెంపునకు వ్యతిరేకంగా పోరాడాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఏదులాపురం గోపాల్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం జూలూరుపాడులో తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మే డే వాల్‌పోస్టర్లను కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో భూక్యా నాగు, బానోత్ ధన్వంతరావు, శీరంశెట్టి వినోద్, ఇనగంటి మురళి, బానోత్ సేవ్యా, సోడె నరసింహారావు, గుగులోత్ హరిసింగ్, మధు, హనుమంతరావు, నవీన్, రాంబాబు పాల్గొన్నారు.

వాడవాడలా మే డే నిర్వహించాలి..

139వ మే డే వేడుకలను వాడవాడలా నిర్వహించాలని సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో ఆల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్కె చాంద్‌పాషా, గుడిమెట్ల సీతయ్య, పత్తిపాటి మహేష్, నిమ్మటూరి లచ్చయ్య, పటేల్, అశోక్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డేను వాడవాడలా ఘనంగా నిర్వహించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబీ పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాలలోని అంగన్‌వాడీ పాఠశాలలను మంగళవారం సీఐటీయూ నేతలు సందర్శించారు. మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మే 20న కార్మికులు నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు పాల్గొనాలని కోరారు. ఈ మేరకు ఐటీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి అరుణకు సమ్మె నోటీసును అందజేశారు. కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, మరియ, రాంబాయి, ఫాతిమా, పార్వతి, సంధ్య, వెంకటమ్మ, దయావతి, రమాదేవి, సౌజన్య, అరుణ పాల్గొన్నారు.

'ఏకలవ్య'కు విద్యార్థుల ఎంపిక

టేకులపల్లి: బద్దుతండాలోని ఏకలవ్య స్కూల్‌కు పలువురు ఆరో తరగతిలో సీటు సాధించారు. వాగొడ్డుతండా ప్రాథమిక పాఠశాలకు చెందిన బండారి చిద్విలాశ్ ఏకలవ్యతో పాటు సైనిక్ స్కూల్, ఫైన్ ఆర్ట్స్ స్కూల్‌లోనూ సీటు సాధించాడు. సులానగర్ కార్మెల్‌మాత మోడల్ స్కూల్ విద్యార్థి కొప్పుల సవిత్ వర్మ, సింగ్యా తండా స్కూల్ విద్యార్థి లకావత్ సాయి సందీప్ ఏకలవ్యలో సీటు సాధించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను అభినందించారు.

బెదిరింపులు ఆపాలి

పాల్వంచరూరల్: పట్టాలు లేని భూములను గుంజుకుంటామని ఫారెస్ట్ అధికారులు బెదిరింపులు మానుకోవాలని సీపీఐ నాయకుడు నిమ్మల రాంబాబు డిమాండ్ చేశారు. ఉల్వనూరులో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 ఏళ్లుగా పేద గిరిజనులు, ఆదివాసీలు సాగుచేసుకుంటున్న పోడు భూములకు ప్రభుత్వం వెంటనే స్పందించి పట్టాలు ఇవ్వాలని కోరారు.

నేడు ట్రైకార్ రుణ లబ్ధిదారుల ఎంపిక

ఇల్లెందు: రాజీవ్ యువ వికాసం పథకం కింద ట్రైకార్ ఎస్టీ రుణాలకు లబ్ధిదారుల ఎంపిక 30న జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో మధ్యాహ్నం 3 గంటలకు సీఆర్‌సీ భవన్ వద్ద కేవలం ఎస్టీ అభ్యర్థులే హాజరు కావాలని కోరారు.

రైతుల పట్ల నిర్లక్ష్యం వీడండి..

జూలూరుపాడు: రైతాంగం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి జాటోత్ కృష్ణ, ఏఐయూకేఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ ధర్మా అన్నారు.

మంగళవారం జూలూరుపాడులో భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) మండల మహాసభ జరిగింది. నాయకులు మాట్లాడుతూ.. దేశంలో రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, దీనికి పార్లమెంట్‌లో చట్టం చేయాలన్నారు. దళారీ వ్యవస్థను అరికట్టాలన్నారు. అనంతరం ఏఐయూకేఎస్ మండల కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా లింగాల వీరభద్రం, ఉపాధ్యక్షుడిగా గుగులోత్ కృష్ణ, కార్యదర్శిగా తోటకూరి నరేష్, సహాయ కార్యదర్శిగా తెల్లం కృష్ణయ్య, కోశాధికారిగా పారుపల్లి బాబురావు ఎన్నికయ్యారు.

19 నుంచి సమ్మెకు సిద్ధం

సింగరేణి(కొత్తగూడెం): మల్టీపర్పస్ రద్దుకై మే 19 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెకు సిద్ధమవుతున్నామని గ్రామ పంచాయితీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ అన్నారు. మంగళవారం కొత్తగూడెంలోని మంచికంటి భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చేయనున్న సమ్మెలో గ్రామపంచా యితీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

చిన్ననాటి నుంచే కళాకారులుగా ఎదగాలి


బహుమతులు అందుకున్న చిన్నారులు

పాల్వంచ: విద్యార్థి దశ నుంచే కళాకారులుగా ఎదగాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు అన్నారు. అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా మంగళవారం డాక్టర్ బేర శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక జీహెచ్‌ఎస్ కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్ర స్థాయి నృత్య పోటీలు నిర్వహించారు. హాజరైన కొత్వాల మాట్లాడుతూ.. నృత్యాలు శారీరక, మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు. అనంతరం పలువురు చిన్నారులు నృత్య ప్రదర్శనలతో అలరించారు. అనంతరం బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఆరోరా స్కూల్ ఆఫ్ నర్సింగ్ చైర్మన్ డాక్టర్ తాళ్లూరి హరిబాబు, ఏఎస్ఐ కస్తూరి, నర్సింహాకుమార్, యర్రంశెట్టి ముత్తయ్య పాల్గొన్నారు.

తాగునీటి కోసం తండ్లాట

- కిలోమీటరు కాలినడకన వెళ్లినా చెలిమ నీరే దిక్కు
- పట్టించుకోని అధికారులు


చెలిమనీటిని తోడుకుంటున్న చిరుతానిపాడు వాసులు

పాల్వంచరూరల్: ఏజెన్సీ గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం తంటాలు పడుతున్నారు. భూగర్భ జలాలు పడిపోయాయి. తీవ్ర తాగునీటి ఎద్దడి పరిస్థితులు తలెత్తాయి. దీంతో గిరిజనులు తల్లడిల్లుతున్నారు. ప్రభుత్వం ఆదివాసీ ఆవాస గ్రామాల ప్రజలకు కూడా తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులను ఆదేశించారు. ఇటీవల డీపీఓ చంద్రమౌళి కూడా ఆదివాసీ గ్రామాల్లో పర్యటించి తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఏఈ, ఎంపీఓలకు ఆదేశాలు జారీ చేశారు. అయినా సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. మండలంలోని అటవీ ప్రాంతంలో జీవనం సాగిస్తున్న ఆదివాసీ గిరిజనులు తాగునీటి కోసం గోస పడుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. తాగునీటి కోసం కిలోమీటరు దూరం కాలినడకన వెళ్తేనే కలుషితమైన చెలిమ నీరే గిరిజనులకు దిక్కు. ఏజెన్సీ ప్రాంతమైన పాల్వంచ మండలం బంద్రుగొండ పంచాయతీ కొయ్యగట్టు గ్రామంలో 270 మంది గిరిజనులు నివాసం ఉంటున్నారు. ఒక చేతిపంపు మాత్రమే ఉంది. అది కూడా వేసవిలో నీళ్ల సక్రమంగా రాని పరిస్థితి. సోలార్ పంప్ సెట్టును ఏర్పాటు చేశారు. కానీ దాని మోటారు పనిచేయకపోవడంతో గిరిజనులు కిలోమీటరు దూరంలో ఉన్న మొర్రేడు వాగు నుంచి తాగునీటిని తెచ్చుకుంటూ నిత్యం అవస్థలు పడుతున్నారు. అదేవిధంగా బంజర గ్రామపంచాయతీ అటవీప్రాంతంలో నివాసం ఉంటున్న రాళ్లచెలక, పెద్దకలస, చిరుతానిపాడు గ్రామంలోని ఆదివాసీ గిరిజన కుటుంబాలు సుమారు 250 మంది జనాభా. ఆయా గ్రామాల్లో వేసవికాలం వచ్చిందంటే తాగునీటి కోసం తల్లడిల్లుతారు. బోరు ఉన్నా అందులో సరిపడా నీళ్ల రాకపోవడంతో వాగులు, వంకల్లో చెలిమ నీటిని తెచ్చుకుని తాగుతారు. కిలోమీటరు దూరం కాలినడకన వెళ్లి కావడ్లు, బిందెల మీద బిందెలు, బుర్రల్లో తాగునీటిని తెచ్చుకుని అవసరాలు తీర్చుకుంటున్నారు. చెలిమలో నీరు కూడా ఊట సక్రమంగా రాకపోవడంతో ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతున్న పరిస్థితి. దంతలబోరు పంచాయతీ సీతారాంపురం, ఎర్రబోరు గ్రామాల్లో తాగునీటి కోసం అల్లాడిపోతున్నారు. ఎర్రబోరులో చేతిపంపు పాడైంది. మిషన్ భగీరథ నీళ్లు సక్రమంగా రావడం లేదు.

పనిచేయని చేతిపంపులు...

మండలంలో 450పైన చేతిపంపులు ఉన్నాయి. అందులో 20కిపైగా పనిచేయడం లేదు. పాండురంగాపురం గ్రామంలో తాగునీటిని సరఫరా చేసే మోటార్ మరమ్మతులకు గురై నెలరోజులు అయినా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పటించుకోవడం లేదని దీంతో నీళ్లు దొరకడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొయ్యగట్టు, సీతారాంపురంలో సోలార్ పంపు మరమ్మతులకు గురికావడం ఉన్న బోర్లలో నీరు సక్రమంగా రాక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు..



అధికారులు పట్టించుకోకపోవడంతో తాగునీటికోసం అవస్థలు పడుతున్నాం. నిత్యం ఉదయం, సాయంత్రం కిలోమీటరు దూరం వెళ్లి కలుషితమైన చెలిమ నీటిని తెచ్చుకుని తాగుతున్నాం.

– మడివి సురేష్, చిరుతానిపాడు

భగీరథ నీళ్లు రావడం లేదు..



మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ ద్వారానే నిత్యం నీళ్లు పట్టుకుంటున్నాం. ఈ నీళ్లు కూడా సక్రమంగా రావడం లేదు. గంటల తరబడి పడిగాపులు కాస్తున్నాం. దూరంగా ఉన్న వాగులోకి వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నాం.

– సురేష్, ఎర్రబోరు

మరమ్మతులు చేయిస్తాం..

ఎర్రబోరు, దంతలబోరు, పాండురంగాపురం తదితర గ్రామాల్లో బోర్లు మరమ్మతులకు చేరుకున్న విషయం తెలిసింది. స్థానికులు సమస్యను వివరించారు. వీలైనంత త్వరగా వాటిని బాగు చేయించి ఆయా గ్రామాల ప్రజలకు తాగునీటిని అందించేందుకు వెంటనే చర్యలు తీసుకుంటాం.

– జి.మహేశ్వరి, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


కొత్తగూడెంఅర్బన్: 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు


సింగరేణి(కొత్తగూడెం): 2007 - 10 బ్యాచ్ పాలిటెక్నిక్ విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధి రామవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999-2000లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 25 సంవత్సరాల తరువాత విద్యార్థులంతా ఒక్కచోట కలుసుకున్నారు. విద్యా బుద్ధులు నేర్పించిన గురువులను సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకుని ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రదీప్ కుమార్, కమలాకర్, శరత్, వెంకటనారాయణ, నరేష్, మహేశ్, సతీష్, కైసర్, రాజేష్, బాలమణి, వినోదిని, రజిని, లావణ్య, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, ఉషారాణి, శ్రీనివాస్, రామకృష్ణ, సలీం, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ 2007–10 (సివిల్) బ్యాచ్ విద్యార్థులు 15 సంవత్సరాల తరువాత మంగళవారం ఒకచోట కలుసుకుని ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను నెమరుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పటి లెక్చరర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంతెల బాలకృష్ణ, బజార్, కీర్తి, స్వర్ణలత, సిద్ధార్థరెడ్డి, చైతన్య, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.